

గొత్తికోయ గూడేలపై.. సీజనల్ పంజా



వాజేడు మండలంలోని పెనుగోలు ఆదివాసీ గూడెం

- చాపకింద నీరులా వ్యాపిస్తున్న మలేరియా, డెంగీ
- తాడ్వాయి, కన్నాయిగూడెం, గోవిందరావుపేట మండలాల్లో 17 కేసులు
- అప్రమత్తమైన వైద్య ఆరోగ్య శాఖ
- మలేరియా, డెంగీ నివారణ నెలలుగా జూన్, జూలై
- ఆశా కార్యకర్తల వద్ద టెస్టింగ్ కిట్లు

ములుగు, జూన్ 14: వానాకాలం ప్రారంభానికి ముందే సీజనల్ వ్యాధులు పంజా విసురుతున్నాయి. ములుగు ఏజెన్సీ ప్రజలను ముఖ్యంగా గొత్తికోయగూడేలను ప్రతీయేడు భయపెట్టే మలేరియా, డెంగీ ఈసారి పడగ విప్పుతున్నాయి. ప్రస్తుతం గొత్తికోయ గూడేల్లో పాజిటివ్ కేసులు వెలుగు చూడటంతో వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. వ్యాధులను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించడంతోపాటు రోగికి మెరుగైన వైద్యం అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. అత్యధిక అటవీ ప్రాంతం ఉన్న ములుగు ఏజెన్సీలో మలేరియా, డెంగీతోపాటు డయేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలడం పరిపాటే. అయితే మండు వేసవిలో 13 మలేరియా, నాలుగు డెంగీ కేసులు మొత్తం 17 పాజిటివ్ కేసులు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. గోవిందరావుపేట పీహెచ్‌సీ పరిధిలో నలుగురికి, తాడ్వాయి పరిధిలో ఆరుగురికి, కాటాపూర్, కొడిశాల, కన్నాయిగూడెం పీహెచ్‌సీల పరిధిలో ఒక్కొక్కరికి మలేరియా నిర్ధారణైంది. అదేవిధంగా వెంకటాపూర్(రామప్ప) పీహెచ్‌సీ పరిధిలో ఒకరికి, రాయినిగూడెం పరిధిలో ఇద్దరికి, పస్రా పరిధిలో ఒకరికి డెంగీ సోకింది. వ్యాధిగ్రస్తులంతా గొత్తికోయ గూడేలకు చెందిన వారు కావడం గమనార్హం. దోమలు, కలుషిత తాగునీటితో వ్యాధి సోకినట్లు నిర్ధారణైంది. చికిత్స అనంతరం వారంతా కోలుకున్నారు. గతేడాది 79 మలేరియా, 30 డెంగీ కేసులు వెలుగు చూశాయి.

123 సమస్యాత్మక గ్రామాల గుర్తింపు

ఎక్కువగా మలేరియా, డెంగీ వ్యాధి ప్రబలే జిల్లాలోని 23 గ్రామాలను సమస్యాత్మకమైనవిగా వైద్య ఆరోగ్య శాఖ గుర్తించింది. ఇక్కడ వ్యాధి నివారణ, ప్రాథమిక స్థాయిలో గుర్తింపు, మెరుగైన వైద్యం అందించేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామానికో ఆశా కార్యకర్త ఉండగా వారి వద్ద 30కి తగ్గకుండా మలేరియా టెస్టింగ్ కిట్లను అందుబాటులో ఉంచనున్నారు. జ్వరం సోకిన వ్యక్తికి మలేరియా, డెంగీ లక్షణాలుంటే వెంటనే పరీక్షలు జరిపి అవసరమైన మందులను అందజేయనున్నారు. ఇదే క్రమంలో జూలైలో ఇంటింటికీ దోమల నివారణ మందును పిచికారీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

మారుమూల అటవీ పల్లెలపై నజర్

జిల్లాలో 60కిపైగా గొత్తికోయగూడేలు, మారుమూల అటవీ గ్రామాలున్నాయి. వీటిలో 20 గ్రామాలకు కనీసం రోడ్డు సదుపాయం లేదు. వర్షాకాలంలో వరదల కారణంగా నడకదారీ మూసుకుపోతుంది. వీటిలో ఐలాపూర్, పోచాపూర్, అల్లిగూడెం, నర్సాపూర్, లవ్వాల, బొల్లెపల్లి, ఎడ్జర్లపల్లి, పెనుగోలు, రాపట్ల తదితర గ్రామాలు బాహ్యప్రపంచానికి చిట్టచివరన ఉంటాయి. దీంతో ఈ గ్రామాలపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు దృష్టి సారించారు. వ్యాధి నిర్ధారణ కిట్లు, మందులను సరిపడా అందుబాటులో ఉంచనున్నారు. గర్భిణులను గుర్తించి ప్రసవానికి నెల రోజుల సమయమున్న వారిని ముందే ఏటూరునాగారం, ములుగు ప్రభుత్వ వైద్యశాలలకు తరలించి అడ్మిట్ చేయాలని నిర్ణయించారు.



వెంకటాపూర్ మండలం రోల్‌బండ గొత్తికోయగూడెంలో చిన్నారిని పరీక్షిస్తున్న డీఎంహెచ్‌వో అప్పయ్య (ఫైల్)

24 గంటల వైద్యసేవలు

జిల్లాలో మొత్తం 15 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలుండగా వీటిలో ఎదిర, గోవిందరావుపేట, కన్నాయిగూడెం, మంగపేట, పేరూరు, తాడ్వాయి, వెంకటాపూర్, వాజేడు పీహెచ్‌సీలను 24 గంటల ఆస్పత్రులుగా గుర్తించారు. వర్షాకాల సీజన్‌లో అన్ని పీహెచ్‌సీల్లో నిరంతర వైద్యసేవలు అందించాలని అధికారులు నిర్ణయించారు. ములుగు ఏరియా వైద్యశాలతోపాటు ఏటూరునాగారం, వెంకటాపురం వెద్యశాలల్లో అన్ని బెడ్లను సిద్ధం చేస్తున్నారు.

అప్రమత్తంగా ఉన్నాం..

- డాక్టర్ అల్లెం అప్పయ్య ములుగు డీఎంహెచ్‌వో



సీజనల్ వ్యాధుల నుంచి ప్రజలను కాపాడేందుకు సిద్ధంగా ఉన్నాం. కేవలం ఎదిర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మాత్రమే రెండో వైద్యాధికారి పోస్టు ఖాళీగా ఉంది. ముగ్గురు పీజీ విద్యనభ్యసించేందుకోసం ప్రత్యేక అనుమతితో వెళ్లారు. మొత్తం 28 మంది వైద్యులు ప్రస్తుతం అందుబాటులో ఉన్నారు. మలేరియా, డెంగీ, సీబీపీ కిట్లను క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంచడం జరిగింది. ఏఎన్ఎంలు, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు పూర్తిస్థాయిలో భర్తీ అయ్యాయి. మూడు నెలలకు సరిపడా మందుల కోసం ప్రభుత్వానికి ఇండెంట్ పెట్టాం. పరిసరాల పరిశుభ్రతను పాటిస్తూ జ్వరం సోకిన వెంటనే పరీక్షలు చేయించుకోవాలి. వర్షాకాలంలో కలుషిత తాగునీటితో ఎక్కువగా వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున కాచి చల్లార్చిన నీటిని తాగాలి. దోమలు వ్యాప్తి చెందకుండా చూసుకోవాలి.

ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్టల్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న భూపాలపల్లి కలెక్టర్, అధికారులు

భూపాలపల్లి కలెక్టరేట్, జూన్ 14 : ధరణి పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో మాట్లాడిన నవీన్ మిట్టల్ ధరణి పెండింగ్ సమస్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ కంటే ముందే ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి 1.38 లక్షల పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించినట్లు తెలిపారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారం కోసం మరోమారు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలన్నారు. కలెక్టర్, అదనపు కలెక్టర్, ఆర్డీవో స్థాయిల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. సక్సేషన్, పెండింగ్ మ్యూటేషన్ వంటి దరఖాస్తుల రికార్డులను పరిశీలించి పరిష్కరించాలన్నారు. కలెక్టర్ భవేష్ మిశ్రా, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● ములుగు కలెక్టరేట్ : ధరణి పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించడంతోపాటు జిల్లాలో భూముల మార్కెట్ విలువ రిపోర్టు సమర్పించాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్‌మిట్టల్ కలెక్టర్‌ను ఆదేశించారు. శుక్రవారం ఆయన హైదరాబాద్‌లోని సీసీఎల్ఏ కార్యాలయం నుంచి ములుగులో కలెక్టర్ ఇలా త్రిపాఠితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నవీన్‌మిట్టల్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, తహసీల్దార్, రెవెన్యూ డివిజన్ అధికారి, అదనపు కలెక్టర్, కలెక్టర్ స్థాయిలలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని సూచించారు. సక్సేషన్, పెండింగ్ మ్యూటేషన్ వంటి దరఖాస్తులు, రికార్డులను పరిశీలించి పరిష్కరించాలన్నారు. వీసీలో అదనపు కలెక్టర్ సీహెచ్. మహేందర్‌జీ, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, జిల్లాలోని తహసీల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కుంగిన ఏడో బ్లాక్‌లో మరో గేటు ఎత్తివేత

మొత్తం 11గేట్లలో 10గేట్ల ఎత్తివేత పూర్తి

మేడిగడ్డ బ్యారేజీలో కొనసాగుతున్న 20వ గేటు తొలగింపు పనులు

ముగిసిన సీఎస్ఎంఆర్ఎస్ బృందం పరీక్షలు 7లో..

‘కొండా’ నివాసానికి మంత్రులు..

వరంగల్ సిటీ, జూన్ 14 : అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు నివాసంలో శుక్రవారం స్పీకర్ సహా పలువురు మంత్రులు, నేతలు సందడి చేశారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సీఎం ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డి సోదరుడు వేం పురుషోత్తంరెడ్డి సంవత్సరీకం కార్యక్రమానికి స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, సీతక్క, ఎంపీ బలరాం నాయక్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు. కార్యక్రమం అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మంత్రి సురేఖతో సరదాగా మాట్లాడుతూ ‘పొరుగు జిల్లా వాళ్లం వచ్చాం.. ఇంటికి పిలిచి కనీసం చాయ్ ఇవ్వవా అక్కా’ అని అనడంతో సురేఖ అందరినీ హనుమకొండలోని తన నివాసానికి తీసుకెళ్లారు. వారికి టీ ఇచ్చి, కొద్దిసేపు సరదాగా ముచ్చటించుకున్నారు. అయితే ఇటీవల మంత్రులు సురేఖ, సీతక్క మధ్య వైరం నడుస్తోందన్న ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో వారిద్దరూ అటు ఫంక్షన్ హాల్‌లో, ఇటు కొండా నివాసంలోను పక్కపక్కనే కూర్చుని సరదాగా ముచ్చట్లు చెప్పుకోవడం ఆసక్తి రేపింది.



మంత్రి సురేఖ నివాసంలో ముచ్చటించుకుంటున్న స్పీకర్, మంత్రులు, నేతలు



కొండా సురేఖ, సీతక్క

మంత్రి సురేఖను కలిసిన నీలం మధు

కాంగ్రెస్ నుంచి మెదక్ ఎంపీగా పోటీ చేసి ఓటమి పాలైన నీలం మధు శుక్రవారం హనుమకొండలోని మంత్రి కొండా సురేఖను మర్యాద పూర్వకంగా కలిశారు. సురేఖ మెదక్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా ఉన్న నేపథ్యంలో మధు హనుమకొండకు వచ్చి మంత్రిని కలిసి జిల్లా అభివృద్ధికి సంబంధించిన విషయాలపై చర్చించారు.

ఇక ‘విద్యుత్ ప్రజావాణి’

ఎన్పీడీసీఎల్‌లో ప్రతీ సోమవారం నిర్వహణ

హనుమకొండ టౌన్, జూన్ 14: విద్యుత్ వినియోగదారులకు చేరువయ్యే కార్యక్రమంలో భాగంగా వారి ఫిర్యాదులు తీసుకొని సకాలంలో పరిష్కరించేందుకు ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్లలో ప్రతీ సోమవారం ‘విద్యుత్ ప్రజావాణి’ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి తెలిపారు. ప్రతీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు 16 సర్కిళ్ల పరిధిలోని డివిజనల్ ఆఫీస్, సబ్‌డివిజనల్ ఆఫీస్, ఈఆర్వో, సెక్షన్ ఆఫీస్‌లలో, అదే రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సర్కిల్ ఆఫీస్‌లో విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. విద్యుత్ ప్రజావాణిని పటిష్టపర్చడంలో భాగంగా సమీక్షలు నిర్వహించి వినియోగదారులు చేసే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోబడుతాయన్నారు. ఇందుకోసం టీజీ ఎన్పీడీసీఎల్‌లోని పోర్టల్‌ను కన్స్యూమర్ రిసెప్షన్ డెస్క్‌లకు అనుసంధానం చేసి విద్యుత్ ప్రజావాణి అనే మరొక పోర్టల్‌ను ఏర్పాటు చేసి వినియోగదారులకు మరింత చేరువ చేస్తున్నామన్నారు. వినియోగదారుల సమస్యల పరిష్కారానికి వేదికగా విద్యుత్ ప్రజావాణి నిలుస్తుందని సీఎండీ వెల్లడించారు.

సేవతో కూడిన ఉద్యోగం చేయడం అదృష్టం

సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీజ



సమీక్షలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ములుగు కలెక్టరేట్, జూన్ 14: సేవతో కూడిన ఉద్యోగం చేయడం అదృష్టమని అదనపు కలెక్టర్ పి.శ్రీజ అన్నారు. శుక్రవారం ములుగు కలెక్టరేట్ ప్రాంగణంలోని ఆడిటోరియంలో జిల్లా సంక్షేమ అధికారి జేఎం.స్వర్ణలత లెనిన అధ్యక్షతన మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పరిధిలోని అన్ని విభాగాలతో సమీక్షా సమావేశం జరగగా అదనపు కలెక్టర్ శ్రీజ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గర్భిణులు, బాలింతల పరంగా రక్తహీనత, తక్కువ బరువు, మాతృ మరణాల వంటి వివిధ అంశాల విషయంలో తల్లుల పరంగా సమస్యలు తగ్గుముఖం పడుతున్నాయని అన్నారు. పిల్లల్లో లోప పోషణను తగ్గించడం సవాల్‌తో కూడుకున్న వ్యవహారమని, క్షేత్రస్థాయిలో రెట్టించిన ఉత్సాహంతో పనిచేసి శిశు మరణాల రేటు పెరగకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారులకు ఇస్తున్న పౌష్టికాహారాన్ని మాత్రమే వినియోగించేలా అంగన్‌వాడీ టీచర్లు అవగాహన కల్పించాలన్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, వైద్యశాఖలు సమన్వయంతో పనిచేస్తేనే లక్ష్యాలను చేరుకోగలమని అన్నారు. అనంతరం బాలల పరిరక్షణ విషయంలో క్షేత్రస్థాయిలో సేవలందిస్తున్న డీసీపీయూ, సీహెచ్‌ఎల్ విభాగాలతో మాట్లాడి వారు అందిస్తున్న సేవలను అభినందించారు. జిల్లాలో బాలకార్మికులు, బాల్య వివాహాలు, పిల్లలపై లైంగిక వేధింపుల నిర్మూలనకు, సురక్షిత, అసురక్షిత స్పర్శలపై వినూత్నమైన రీతిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. వివిధ రాష్ట్రాల నుంచి వస్తున్న బాలకార్మికుల నిరోధానికి ఆయా రాష్ట్రాల అధికార యంత్రాంగంతో చర్చించి కట్టడి చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అన్నారు. అదేవిధంగా జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లోని మహిళలు ఆర్థిక అక్షరాస్యత సాధించేలా కృషి చేయాలని సూచించారు. వివిధ రకాలుగా హింసకు గురవుతున్న బాధిత మహిళలకు సఖి అండగా నిలవాలని, వారికి అంకితభావంతో సత్వరమైన సేవలు నిరంతరంగా అందేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ వసుధ, డీసీపీవో ఓంకార్, సీడబ్ల్యూసీ సభ్యులు మధు, షాహిదాబేగం, సీడీపీవోలు హేమలత, మల్లీశ్వరి, స్వాతి, శిరీష, సూపర్‌వైజర్లు, డీసీపీయూ, సీహెచ్‌ఎల్, డీహెచ్‌ఈడబ్ల్యూ, సఖి సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం భవన నిర్మాణాలు చేపట్టాలి

బల్దియా కమిషన్ అశ్విన తానాజీ వాకడే



మడికొండలో భవన నిర్మాణ అనుమతులను పరిశీలిస్తున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, జూన్ 14: ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్రేటర్ వరంగల్ పరిధిలో భవన నిర్మాణాలు చేపట్టాలని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విన తానాజీ వాకడే అధికారులకు సూచించారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని మడికొండలో పర్యటించి అక్కడి భవన నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా చట్టంలో చూపించి విధంగా నిబంధనల మేరకు ప్రమాణాల ప్రకారం భవనాలు నిర్మించే కట్టడాలకు మాత్రమే అనుమతులు మంజూరు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదాతలను సత్కరిస్తున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్

ఒకరి రక్తదానంతో ముగ్గురికి ప్రాణదానం

హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్

సుబేదారి, జూన్ 14 : ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం సుబేదారిలోని రెడ్ క్రాస్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ సిక్తాపట్నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఒకరి రక్తదానంతో ముగ్గురికి ప్రాణదానం చేయవచ్చని అన్నారు. రెడ్ క్రాస్ సొసైటీలోని జనరిక్ మందుల షాపు తలసేమియా సెంటర్‌ను సందర్శించి చిన్నారులతో మాట్లాడి వారి బాగోగులు తెలుసుకున్నారు. తలసేమియా బాధితులకు పండ్లు పంపిణీ చేశారు. హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తలసేమియా సెంటర్‌తో పాటు జనరిక్ మెడికల్ షాపు నిర్వహణలో రాష్ట్రంలోనే ద్వితీయ స్థానంలో ఉందని తెలిపారు. అత్యవసర సమయంలో రెడ్ క్రాస్ సేవలు ముందుంటాయని ప్రాణాలను కాపాడేందుకు తమ రక్తాన్ని దానం చేసిన రక్తదాతలను రక్తదాన శిబిరాలను నిర్వహించిన ఆర్గనైజర్లను ఈ సందర్భంగా కలెక్టర్ అభినందించారు.

కార్యక్రమం అనంతరం ఉత్తమ రక్తదాతలుగా ఎంపికైన వారికి కలెక్టర్, పాలక వర్గం చేతుల మీదుగా ప్రశంసాపత్రం, షీల్డు, శాలువాతో సత్కరించారు. అనంతరం కలెక్టర్‌ను పాలకవర్గం షీల్డు, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణగౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, పాలక వర్గ సభ్యులు పుల్లూరు వేణుగోపాల్, పొట్లపల్లి శ్రీనివాసరావు, డాక్టర్ సీహెచ్. సంధ్యారాణి, బాషెట్టి హరిప్రసాద్, రక్తదాతలు, బ్లడ్ డొనేషన్ క్యాంప్ ఆర్గనైజర్స్, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.



రాంనగర్‌లోని తన నివాసంలో వినతులు స్వీకరిస్తున్న మంత్రి సురేఖ

ఎప్పుడైనా.. ఎక్కడైనా నన్ను కలవొచ్చు

● అటవీ, దేవాదాయ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ

● నివాసంలో ప్రజల నుంచి వినతుల స్వీకరణ

వరంగల్‌సిటీ, జూన్ 14: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమని, ఎవరైనా.. ఎప్పుడైనా.. ఎక్కడైనా తనను కలవచ్చని అటవీ, దేవాదాయ పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం హనుమకొండ రాంనగర్‌లోని తన నివాసంలో తూర్పు నియోజకవర్గంలో నుంచి వచ్చిన ప్రజలకు అందుబాటులో ఉన్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. అధికారులకు ఫోన్ చేసి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. మంత్రి మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ధ్యేమన్నారు. మంత్రిగా ఉన్న నేపథ్యంలో హైదరాబాద్ లేదా ఇతర జిల్లాల పర్యటనలో ఉన్నప్పుడు నియోజకవర్గానికి చెందిన నాయకులు ప్రజల సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చేలా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. వరంగల్, హనుమకొండ, హైదరాబాద్‌లోని తన నివాసంలో లేదంటే సెక్రటేరియేట్‌లో కలవవచ్చని తెలిపారు. శుక్రవారం సుమారు 150 వినతులను పరిష్కరించినట్లు తెలిపారు.

గొర్రెలకాపరితో ప్రభుత్వ పథకాలపై ఆరా...

హనుమకొండ రాంనగర్‌లో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం తోటి మంత్రులు, ప్రజలు, నాయకులతో మంత్రి సురేఖ బిజీబిజీగా గడిపారు. సాయంత్రం మంత్రి హైదరాబాద్ బయలుదేరారు. మార్గ మధ్యలో ఓ గొర్రెలకాపరి గొర్రెల మందతో రోడ్డు పక్కన వెళుతుండగా మంత్రి కాన్వాయ్ దిగి అతడి వద్దకు వెళ్లి రెండు చిన్న గొర్రెపిల్లలు ఎత్తుకున్నారు. గొర్రెలకాపరితో ముచ్చటిస్తూ ప్రభుత్వ పథకాలు మీకు, మీ గ్రామస్థులకు చేరుతున్నాయా.. అంటూ నెమ్మదిగా ప్రభుత్వ పథకాలపై ఆరా తీశారు. కొద్దిసేపు మాట్లాడి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

పురుషోత్తం రెడ్డి సేవలు మరువలేనివి



వేం పురుషోత్తం రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రులు, కాంగ్రెస్ నాయకులు

బాలసముద్రం, జూన్ 14: ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు వేం నరేందర్ సోదరుడు వేం పురుషోత్తంరెడ్డి ప్రథమ వర్ధంతిని హనుమకొండలోని సీఎస్ఆర్ గార్డెన్‌లో కుటుంబ సభ్యులు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొండా సురేఖ, దనసరి అనసూయ (సీతక్క), పొన్నం ప్రభాకర్‌గౌడ్, తెలంగాణ శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, మాజీ ఉప ముఖ్యమంత్రి స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొని పురుషోత్తం రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ సిరిసిల్ల రాజయ్య, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, టెస్కాబ్ ఛైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఆపద్బాంధవులు

- అత్యవసర సమయాల్లో డీఆర్‌ఎఫ్ సేవలు భేష్
- దయనీయ స్థితిలో సిబ్బంది పరిస్థితి
- చాలీచాలని జీతాలతో కాలం వెల్లదీత
- బల్దియా కమిషనర్ పట్టించుకోవాలని వేడుకోలు



బల్దియా పరిధిలో సేవలందిస్తున్న డీఆర్‌ఎఫ్ సిబ్బంది

వరంగల్ కార్పొరేషన్, జూన్ 5: వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్‌ఎఫ్) విపత్తు ప్రతిస్పందన దళం సమస్యల వలయంలో కునారిల్లుతోంది. సిబ్బందికి ప్రభుత్వం నుంచి అందించే కనీస సౌకర్యాలు అందించకపోవడంతో పాటు నెలవారిగా వచ్చే చాలీచాలనీ జీతం సైతం సమయానికి అందకపోవడంతో సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నారు. నగర ప్రజల ప్రాణాలు కాపాడేందుకు తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పనిచేసే డీఆర్‌ఎఫ్ సిబ్బంది సేవలు వెలకట్టలేకుండా ఉన్నా వారిపనికి గుర్తింపు లేదు. సిబ్బందికి పనికి సరిపడా వేతనం లేక ఇబ్బందులు పడుతున్నారు. పెరిగిన ధరలు, మారుతున్న పరిస్థితుల దృష్ట్యా కొంత మేరకు జీతాలు పెరిగితే బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం అన్ని అలవెన్స్‌లు కలుపుకుని రూ. 17,500 మాత్రమే వస్తున్నాయని, కనీసం రూ. 25వేల వరకు జీతం పెంచితే పిల్లల చదువులకు ఉపయోగపడుతాయని విజ్ఞప్తి చేస్తున్నారు.

అయితే ఐదేళ్ల కాలంలో వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 30 మంది డీఆర్‌ఎఫ్ సిబ్బంది మాత్రమే పని చేస్తున్నారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని 66 డివిజన్‌ల పరిధిలో 12లక్షలకు పైచిలుకు జనాభా నివసిస్తున్నారు. కానీ 24 కిలో మీటర్ల దూరం విస్తరించి ఉన్న బల్దియా పరిధిలో విపత్తు జరిగిన సమయంలో ప్రమాదస్థలికి వెళ్లాలంటే సిబ్బందికి ప్రాణసంకటంగా మారుతోంది. మంటల్లో చిక్కుకున్న వారిని సైతం తీసేందుకు వీరినే వినియోగించడం, గ్యారెంటీ లేని వీరి జీవితాలకు కార్పొరేషన్‌పరంగా కనీస బీమా కల్పించకపోవడం బాధిస్తోందంటున్నారు. నీటి ప్రమాదాల్లో మృతిచెంది ముక్కలుగా విడిపోతున్న శరీర భాగాలను వెలికి తీసే వీరి పని సాహసోపేతమైనది.

సాహస కార్యాలు

- గొర్రెకుంటలో హత్యచేసి పడేసిన 9 మృతదేహాలు వెలికితీత.
- హంటర్‌రోడ్డులో వరదలో మునిగిపోయిన ఇద్దరు వృద్ధులు, నలుగురు మహిళలను నీటి ప్రమాదం నుంచి తప్పించారు.
- సమ్మయ్యనగర్‌లో వరదలో చిక్కిన వారిని పడవల సహాయంతో కాపాడారు.
- భద్రకాళి సంతోషిమాత గుడి వెనుక గుండంలో మృతి చెందిన వృద్ధురాలి వెలికితీత.
- కేసీ కెనాల్ ఆటోనగర్ వద్ద రెండు మృతదేహాల వెలికితీత.
- నక్కలపల్లిలో బావిలో పడి ఆత్మహత్య చేసుకున్న మహిళ మృతదేహం వెలికితీత.
- న్యూశాయంపేట చెరువులో మృతదేహం వెలికితీత.
- రంగంపేటలో బావిలో పడిన వృద్ధురాలి మృతదేహం వెలికితీత.
- ఏనుమాముల మార్కెట్ వెనుక మునలమ్మకుంటలో ఇద్దరి మృతదేహాలు వెలికితీత.
- గాలి వానకు రోడ్డుకు అడ్డంగా పడిపోయిన 452 చెట్లు తొలగింపు.
- 240 అక్రమ కట్టడాలు, నిర్మాణాలు తొలగింపు.

2010లో డీఆర్‌ఎఫ్ విభాగం ఏర్పాటు

ప్రజలు నివసించే ప్రదేశాల్లో విపత్తు జరిగిన సమయంలో అక్కడి పరిస్థితులను అదుపు తెచ్చి ప్రాణనష్టం జరుగకుండా కాపాడేందుకు రాష్ట్ర వ్యాప్తంగా డీఆర్‌ఎఫ్ (విపత్తు ప్రతిస్పందన దళం) బృందాలను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కమిషనర్‌గా పమేలా సత్పతి పని చేసిన కాలంలో వరంగల్ బల్దియాలో 2019 జూన్ మాసంలో డీఆర్‌ఎఫ్ బృందాలను ఏర్పాటు చేశారు. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ లేకుండా నగరంతో పాటు విలీన గ్రామాల గ్రామ పంచాయతీ కార్యాలయాలకు అనుసంధానంగా పని చేసే దినసరి ఉద్యోగులలో ఆసక్తి ఉన్నవారిని మౌఖిక పరీక్ష ఆధారంగా డీఆర్‌ఎఫ్ విభాగంలో నియమించారు. 30మందితోపాటు ఇద్దరు డ్రైవర్లను నియమించారు. సిబ్బందిని పర్యవేక్షించేందుకు ఇన్‌చార్జి ఉంటారు. కాగా, డీఆర్‌ఎఫ్ సిబ్బంది ఎల్లవేళలా విధులు నిర్వర్తిస్తారు. రోజుకు మూడు షిఫ్టులతో పని చేస్తూ నక్కలగుట్ట వాటర్ ట్యాంక్, బల్దియా ఇండోర్ స్టేడియం వద్ద స్టాండింగ్ డ్యూటీలో ఉంటారు.

అత్యవసర సమయంలో..

బల్దియా పరిధిలో ఎలాంటి విపత్తు జరిగినా టోల్ ఫ్రీ నెంబర్ 18004351980తో పాటు 9701999676 రిస్క్‌కాల్ కావడంతో బల్దియా డీఆర్‌ఎఫ్ సిబ్బందికి అప్రమత్తం చేస్తారు. వీరు రాత్రనక, పగలనక ఘటనా స్థలానికి చేరుకుని పనిలో నిమగ్నమై పోతారు. కిందటేడు వర్షాకాలంలో నగరం నీటమునగడంతో పాటు చాలాచోట్ల ఇళ్లలోకి వరద నీరు చేరుకోగా చాలామంది ప్రాణాలు కాపాడడంతో వీరి కృషి వెలకట్టలేనిది. ఇంకా భద్రకాళి చెరువు మత్తడి పడి చెరువు కట్ట తెగిపోవడంతో వీరు దిగువ ప్రాంతంలో ఉన్న వారిని అప్రమత్తం చేయడంతో పాటు విలువైన వస్తువులను గడ్డకు చేర్చారు. అంతేకాకుండా వర్షాలు, ఫ్లడ్స్, పేలుళ్లు, అగ్నిప్రమాదాలు, నీటి ప్రమాదాలు, రోడ్డు ప్రమాదాలు, చెరువులు, కెనాల్‌లో పడిన మనుషుల మృతదేహాలు, జంతువులు కలేభరాలు తీయడం, గాలి వానకు రోడ్డుకు అడ్డంగా పడి పోయిన చెట్లను తొలగించి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చేయడం వంటి పనులు చేస్తారు. అంతేకాకుండా నగరంలో రోడ్లను అక్రమించి నిర్మించిన అక్రమ కట్టడాలు, అక్రమ నిర్మాణాలు, అక్రమ ర్యాంప్‌ల నిర్మాణాలు, అక్రమ వెంచర్‌ల నిర్మాణాలను తొలగించేందుకు డీఆర్‌ఎఫ్ సిబ్బందిని ఉపయెగిస్తున్నారు. అయితే సిబ్బంది కొరత వల్ల ప్రమాదాలు జరిగే ప్రతీ చోటికి వెళ్లడం కష్టంగా ఉందని సిబ్బంది చెప్పుకొస్తున్నారు. 12 లక్షల జనాభాకు కనీసం 150 మంది సిబ్బంది 5 వాహనాలు, 10 మంది డ్రైవర్లు, ఒక పూర్తికాలం సూపరింటెండెంట్ స్థాయి అధికారిని నియమించాలని, దీనిపై కమిషనర్ స్పందించాలని సిబ్బంది వేడుకున్నారు.



మృతదేహాలను వెలికితీస్తున్న డీఆర్‌ఎఫ్ సిబ్బంది (ఫైల్)

బల్దియాలో బదిలీ ప్రకంపనలు

సెక్షన్‌లో ఆరా తీస్తున్న ఉద్యోగులు

వరంగల్ కార్పొరేషన్, జూన్ 14: వరంగల్ బల్దియాలో వివిధ విభాగాల సిబ్బందికి, వింగ్ అధికారులకు బదిలీలు తప్పవనే వార్తలు ఉద్యోగుల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో 'బల్దియాలో బదిలీల గుబులు' అనే వార్త ప్రచురితం కావడం చర్చనీయాంశమైంది. ట్రాన్స్‌ఫర్ అయ్యే సుమారు 126 మంది ఉద్యోగుల్లో తమ పేరు ఉందా? అని బల్దియా ఉన్నతాధికారులు, సి-1 సెక్షన్ సిబ్బంది వద్దకు వెళ్లి రహస్యంగా తెలుసుకున్నారు. ఇంకా టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్, శానిటేషన్, పబ్లిక్ హెల్త్, మలేరియా, హార్టికల్చర్ సిబ్బంది వారి అనుయాయులను ట్రాన్స్‌ఫర్ విభాగం సెక్షన్ అధికారుల వద్దకు పంపించి విచారించినట్లు సమాచారం. ఇంకా కొందరు ఫోన్‌ల ద్వారా బదిలీ ప్రక్రియపై అడిగి తెలుసుకున్నారు.

ప్రజాప్రతినిధుల వద్దకు పరుగులు

బల్దియాలో బదిలీలు జరుగుతాయని తెలిసిన ఉద్యోగులు ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, మంత్రుల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఇంకా కొందరు మునిసిపల్ అధికారులను ప్రసన్నం చేసుకుని బదిలీ నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. అయితే ఢిల్లీలో ఉన్న కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే నగరానికి వచ్చిన తర్వాత సర్వీస్ బుక్ ఆధారంగా బదిలీలు తప్పకుండా జరుగుతాయని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్‌ఎంఎంఎస్ ఉపకార వేతనానికి విద్యార్థి ఎంపిక



ఐనవోలు, జూన్ 14: ఐనవోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి బండ విజయ్ ఎన్‌ఎంఎంఎస్(జాతీయ స్థాయి)లో ఉపకారవేతనానికి ఎంపికయ్యారు. ఈ యేడు ఫిబ్రవరిలో నిర్వహించిన ఎంపిక పరీక్షలో పాల్గొని ఎంపికైనట్లు ఆ విభాగం ఇన్‌చార్జి ఉపాధ్యాయుడు పి. సత్యనారాయణరావు తెలిపారు. 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ప్రతీ సంవత్సరం రూ.12 వేల చొప్పున రూ.48 వేల ఉపకార వేతనాన్ని పొందనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి విజయ్‌ను హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు అభినందించారు.

అఖిల భారత నృత్యోత్సవంలో ప్రతిభ

కాజీపేట, జూన్ 14: ఒడిషాలోని పూరి జగన్నాథ దేవాలయంలో జరిగిన అఖిల భారత నృత్యోత్సవంలో వివిధ విభాగాల్లో తాళ్లపల్లి పద్మావతి ఒలంపియాడ్ పాఠశాల విద్యార్థులు బహుమతులు సాధించారు. పాఠశాలకు చెందిన ఆశ్రితారెడ్డి గ్రూప్ డ్యాన్స్ కేటగిరిలో ప్రథమ బహుమతి గెలుచుకోగా, డ్యూయెట్ డాన్స్ కేటగిరిలో నిగేషిత ప్రథమ బహుమతి సాధించారు. వీరిని ఛైర్మన్ తాళ్ల మల్లేశం అభినందించారు.

కుంగిన ఏడో బ్లాక్‌లో మరో గేటు ఎత్తివేత

● మొత్తం 11గేట్లలో 10గేట్ల ఎత్తివేత పూర్తి ● మేడిగడ్డ బ్యారేజీలో కొనసాగుతున్న 20వ గేటు తొలగింపు పనులు ● ముగిసిన సీఎస్‌ఎంఆర్‌ఎస్ బృందం పరీక్షలు



పూర్తిగా పైకెత్తిన 21వ నెంబరు గేటు

మహదేవపూర్ రూరల్, జూన్ 14 : కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మహదేవపూర్ మండలంలో కుంగుబాటుకు గురైన మేడిగడ్డ బ్యారేజీ ఏడో బ్లాక్‌లో గేట్ల ఎత్తివేత పనులు చివరి దశకు చేరుకున్నాయి. అందులో భాగంగా శుక్రవారం 21వ నెంబరు గేటును 12.50 మీటర్ల ఎత్తుకు విజయ వంతంగా ఎత్తారు. బ్లాక్-7లో మొత్తం 11 గేట్లు ఉండగా శుక్రవారంవరకు 10 గేట్లను ఎత్తివేశారు. కుంగుబాటు ప్రభావం అధికంగా ఉన్న 20వ గేటు ఎత్తడం ఇబ్బందికరంగా మారడంతో గత నెల 25న ఆర్క్‌గ్రౌగింగ్ పద్ధతిన గేటు కట్‌చేసి తొలగించే పనులు ప్రారంభించారు. రెండు రోజుల క్రితమే గేటు కటింగ్ పూర్తయినప్పటికి దాని విడిభాగాల తొలగింపు కోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పిల్లర్ల కిందున్న అగాదం పూడ్చివేతలో భాగంగా చేపట్టిన ఇసుక, సిమెంటు గ్రౌటింగ్, షీట్‌ఫైల్స్ అమరిక, సీసీబ్లాకుల పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయి.

గేట్లు ఎత్తారిలా..

తొలుత బ్లాక్-7లోని 11 గేట్లలో 19, 20, 21, 22గేట్లను ఎత్తేందుకు వీలుకాదని.. వీటన్నింటిని తొలగించాలని అధికారులు భావించారు. ఆ తర్వాత 19, 22 గేట్లను ఆటోమాటిక్ పద్ధతిన ఎత్తిన అధికారులు 20, 21 గేట్లను తొలగించాలని నిర్ణయించారు. తాజాగా చేపట్టిన ఇసుక, సిమెంట్ గ్రౌటింగ్ పనులతో పిల్లర్ల కింద గట్టిదనం ఏర్పడటంతో శుక్రవారం కుంగిన పిల్లరు పక్కనే ఉన్న 21వ గేటును సైతం విజయవంతంగా పైకెత్తారు. నెల రోజుల వ్యవధిలో గేట్లు ఎత్తే ప్రక్రియను ఓ కొలిక్కి తీసుకువచ్చారు. గత మే నెల 17న 15వ నెంబరు గేటును ఎత్తగా, జూన్ 6న 16, 17 గేట్లను ఎత్తారు. 8న 22వ గేటును ఎత్తిన అధికారులు తాజాగా గురువారం సాయంత్రం 18, 19 గేట్లను, శుక్రవారం 21వ గేటును ఎత్తారు. దీంతో బ్లాక్-7లో మొత్తం 11 గేట్లకు గాను 10 గేట్లను ఎత్తివేశారు.

ముగిసిన సీఎస్‌ఎంఆర్‌ఎస్ బృందం పరీక్షలు

నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ సూచనల మేరకు మేడిగడ్డ బ్యారేజీ కుంగిన ఏడో బ్లాక్‌లో న్యూఢిల్లీకి చెందిన సీఎస్‌ఎంఆర్‌ఎస్(సెంట్రల్ సాయిల్ మెటీరియల్ రీసెర్చ్ స్టేషన్) నిపుణుల బృందం ఆధ్వర్యంలో చేపట్టిన టెస్టులు, పలు నమూనాల సేకరణ పనులు శుక్రవారంతో ముగిశాయి. జూన్ 5వ తేదీన మేడిగడ్డ బ్యారేజీలోని బ్లాక్-7లో సీఎస్‌ఎంఆర్‌ఎస్‌కు చెందిన హరిదేవ్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల నిపుణుల బృందం భూభౌతిక, మృత్తిక, భూసాంకేతిక పరీక్షలను ప్రారంభించింది. పది రోజుల పాటు బ్లాక్-7లో చేపట్టవలసిన పరీక్షలు, నమూనాలను సేకరించిన బృందం పరీక్షల్లో ప్రధానమైన జియోఫిజికల్, జియోటెక్నికల్, కాంక్రీట్‌పరీక్షలను పూర్తిచేసి శుక్రవారం న్యూఢిల్లీకి వెళ్లిపోయారు. బ్యారేజీ కింద 25 మీటర్ల లోతున ఉన్న మట్టి నమూనాలతో పాటు మరికొన్ని శాంపిల్స్ సేకరణను నిర్మాణ సంస్థతో పాటు ఇంజనీరింగ్ అధికారులు సేకరించి న్యూఢిల్లీలోని సీఎస్‌ఎంఆర్‌ఎస్ ల్యాబ్‌కు పంపించాలని చెప్పి వెళ్లినట్లు తెలిసింది. సీఎస్‌ఎంఆర్‌ఎస్ బృందం చేపట్టిన పరీక్షలు ఇంతటితో పూర్తి కావని, మరో ఐదారు విడతలు బ్యారేజీని పరిశీలించి పరీక్షించనున్నట్లు తెలిసింది.

మూలమలుపులో కలప లారీ బోల్తా

గూడూరులో దుంగలు మీదపడి ఇద్దరి దుర్మరణం ● మృతుల్లో సీఐ గన్‌మెన్, సీఆర్టీ ఉపాధ్యాయుడు



గూడూరులో రాస్తారోకో నిర్వహిస్తున్న మృతుల బంధువులు, ఆదివాసీ సంఘాల నాయకులు

గూడూరు, జూన్ 14: కలపదుంగల లోడుతో వెళుతున్న ఓ లారీ మూలమలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో ఇద్దరు దుర్మరణం పాలైన సంఘటన గూడూరులో శుక్రవారం ఉదయం జరిగింది. మృత్యుశకటంలా వచ్చిన ఆ లారీ రహదారి పక్కన టీ తాగుతున్న ఇద్దరి ప్రాణాలు తీయడం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటనకు సంబంధించి గూడూరు ఎస్ఐ నాగేష్ తెలిపిన వివరాల ప్రకారం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి జామాయిల్ కలప దుంగల లోడుతో ఓ లారీ మహబూబాబాద్ మీదుగా బలార్షాకు వెళుతోంది. శుక్రవారం ఉదయం గూడూరు మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో మూలమలుపు వద్ద వేగంగా వచ్చిన ఆ లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో లారీలోని దుంగలు మీదపడి గూడూరు మండలం మట్వాడ శివారు కొంగరిగిద్దకు చెందిన ధనసరి పాపారావు (35), మచ్చర్లకు చెందిన చుంచా దేవేందర్ (34) అక్కడికక్కడే మృతి చెందారు. వీరిలో ధనసరి పాపారావు గూడూరు సీఐ గన్‌మెన్‌గా, చుంచా దేవేందర్ ములుగు జిల్లా రాయినిగూడెం గిరిజన ఆశ్రమ పాఠశాల సీఆర్టీ ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్నారు. మానుకోట పట్టణంలో జరిగే పోలీస్ శిక్షణ కార్యక్రమానికి తన ద్విచక్రవాహనంపై ఉదయం కొంగరిగిద్దలోని ఇంటి నుంచి ధనసరి పాపారావు ఠాణాలో ఉన్న బూట్లు, యూనిఫాం కోసమని బయలు దేరి వస్తున్నాడు. స్కూల్‌కు వెళ్లేందుకు మచ్చర్ల వద్ద బస్సుకోసం వేచిచూస్తున్న దేవేందర్‌ను బైక్‌పై ఎక్కించుకుని గూడూరుకు చేరుకున్నారు. వరుసకు అన్నదమ్ములైన వారు బైక్‌ను పక్కన పెట్టి, గూడూరులోని మూలమలుపు బస్టాప్ పక్కనే ఉన్న టీస్టాల్ వద్ద టీ తాగుతున్నారు. 365 జాతీయ రహదారిపై జమాయిల్ కలప దుంగల లోడుతో వచ్చిన లారీ అదుపు తప్పి గూడూరులోని బస్టాండ్ మూలమలుపు వద్ద బోల్తా పడింది. అక్కడే ఉన్న పాపారావు, దేవేందర్‌పై దుంగలు పడడంతో అక్కడికక్కడే వారు మృతి చెందారు.

ఎస్ఐ నగేష్ ఘటన స్థలానికి చేరుకుని, ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్‌కు సమాచారం అందించారు. వెంటనే ఘటన స్థలానికి చేరుకున్న ఎస్పీ దుంగలను తొలగించే సహాయక చర్యలు పర్యవేక్షించారు. స్థానికుల సాయంతో దుంగలను తొలగించి పాపారావు, దేవేందర్‌ను బయటకు తీయగా, అప్పటికే వారు మృతిచెంది ఉండటంతో పోస్టుమార్టం నిమిత్తం గూడూరు మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం ఇద్దరి మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించారు. సీఐ గన్‌మెన్ ధనసరి పాపారావు కుటుంబసభ్యులను ఎస్పీ పరామర్శించి, ధైర్యం చెప్పారు. తక్షణ సాయంగా రూ.20 వేలు అందించారు. అనంతరం కొంగరిగిద్దలో ప్రభుత్వ అధికార లాంఛనాలతో పాపారావు అంత్యక్రియలను పూర్తి చేశారు. అలాగే మచ్చర్లలో చుంచ దేవేందర్ అంత్యక్రియలు జరిగాయి. అంత్యక్రియల సమయంలో దేవేందర్ మృతిని తట్టుకోలేక రోదిస్తున్న భార్య భారతి అస్వస్థతకు గురయ్యారు. ఆమెను గూడూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్సనందించారు. ఎస్పీ ఆస్పత్రికి చేరుకుని, భారతిని ధైర్యంగా ఉండాలని చెప్పారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, డీఎస్పీ తిరుపతిరావు పాపారావు, దేవేందర్ మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. కాగా, రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పాపారావు, దేవేందర్ కుటుంబాలకు న్యాయం చేయాలని కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్థులు, ఆదివాసీ సంఘాల నాయకులు గూడూరులో ధర్నా నిర్వహించారు. ఎస్సై నగేష్ మృతుల కుటుంబాలకు న్యాయం చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో వారు ఆందోళనను విరమించారు.



మృతదేహాలను పరిశీలిస్తున్న మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్



గూడూరు వద్ద లారీబోల్తా పడిన ఘటనలో మృతి చెందిన ధనసరి పాపారావు, చుంచా దేవేందర్

ఒకే పాఠశాలలో ఇద్దరి విద్యాభ్యాసం

పాపారావు, దేవేందర్ తమ విద్యాభ్యాసాన్ని గూడూరు మండలం దామెరవంచ గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో పూర్తి చేశారు. పాపారావు 2003-04 విద్యాసంవత్సరంలో పదో తరగతి పూర్తి చేయగా, దేవేందర్ 2004-05లో ఎస్సెస్సీ పూర్తి చేశాడు. ఒకేచోట చదువుకున్న ఇరువురు బంధుత్వంతో పాటు మంచి మిత్రులుగా ఉండేవారు. మృత్యువులో కూడా వారి స్నేహబంధం వీడకపోవడం అందరి మనస్సులను కలచివేసింది.

ప్రమాదం నుంచి బయటపడ్డ మరో ముగ్గురు..

గూడూరులో ప్రమాదం జరిగిన సమయంలో టీకొట్టు యాజమాని మౌలానా టీ పొడి తీసుకొచ్చేందుకు కిరాణా షాపునకు వెళ్లగా, మానుకోట పట్టణం గుమ్మ దూరుకు చెందిన మరోవ్యక్తి పొగాకుల పోతరాజు వ్యాపారం చేసుకుంటూ బస్టాండ్ వద్దకు ఉన్న టీస్టాల్ ముందు ఆటో నిలిపాడు. ఆయనకు ఫోన్ రావడంతో పక్కవెళ్లి మాట్లాడుతున్నాడు. ఇంతలోనే కలప దుంగలతో వచ్చిన లారీ ఒక్కసారిగా బోల్తా పడడంతో వారు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. పక్కనే ఉన్న కూరగాయల దుకాణం తీసేందుకు వచ్చి వ్యాపారి సురేష్‌కు కలప దుంగలు తగలడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డారు.



రౌతుగూడెంలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న కొత్తగూడ ఎస్సై దిలీప్

భర్త మరణం తట్టుకోలేక భార్య ఆత్మహత్య

మహబూబాబాద్ జిల్లా రౌతుగూడెంలో ఘటన

కొత్తగూడ (మహబూబాబాద్ జిల్లా), జూన్ 14 : విధి ఆ కుటుంబాన్ని పగపట్టింది. వరుస విషాదాలు ఆ కుటుంబాన్ని వెంటాడుతున్నాయి. రోడ్డు ప్రమాదంలో భర్త మరణించడాన్ని జీర్ణించుకోలేకపోయినా ఆ ఇల్లాలు బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. పది రోజుల వ్యవధిలో జరిగిన ఈ ఘటనలతో ఆ కుటుంబం దుఃఖసాగరంలో మునిగింది. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని రౌతుగూడెంలో జరిగింది. ఎస్ఐ దిలీప్ తెలిపిన వివరాల ప్రకారం.

కొత్తగూడ మండలంలోని రౌతుగూడెం గ్రామానికి చెందిన మాలోతు రవికి వరంగల్ జిల్లా సంగెం మండలం తిమ్మాపురానికి చెందిన సరిత (38)తో 18 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి సంతానం లేదు. వ్యవసాయంతో పాటు కూలిపనులు చేసుకొంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఈనెల 5వ తేదీన వరంగల్ జిల్లా సంగెం మండలంలో తమ బంధువు మరణించగా పరామర్శించేదుకు వెళ్లి, తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మాలోతు రవి మృతి చెందాడు. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన సరిత గురువారం రాత్రి గ్రామ సమీపంలోని బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఉదయం ఇంట్లో సరిత కనిపించక పోవడంతో కుటుంబసభ్యులు, గ్రామస్థులు చుట్టుపక్కల వెతకగా.. గ్రామశివారు బావిలో సరిత మృతదేహాన్ని కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, పంచనామా నిర్వహించారు. మృతురాలి సోదరుడు అంగోత్ గణేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఎస్ఐ దిలీప్ తెలిపారు. ఇక సరిత చెల్లెలు కూడా పది రోజుల క్రితం మరణించింది. ఇలా వరుస విషాదాలు ఆ కుటుంబాన్ని వెంటాడుతున్నాయని స్థానికులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు.



మాలోతు రవి, సరిత (ఫైల్)

బాంబు దాడిలో గాయపడిన మహిళకు సాయం

వెంకటాపురం(నూగూరు), జూన్ 14: మండలంలోని కర్రిగుట్ట అడవుల్లో మావోయిస్టులు అమర్చిన ప్రెషర్ బాంబు పేలడంతో గాయపడిన చొక్కాల గ్రామానికి చెందిన దర్రా సునీతకు గ్రామస్థులు శుక్రవారం ఆర్థిక సాయం అందించారు. ఓడబలిజ సేవా సంఘంతో పాటు గ్రామస్థులు రూ.లక్షా20వేలను సేకరించి సునీత భర్త మహేష్‌కు వైద్యఖర్చుల నిమిత్తం అందజేశారు. కాగా, భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సునీతను భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ పరామర్శించారు. కార్యక్రమంలో దర్రా దామోదర్, తోట నాని, రవి, పోతురాజు, దివాకర్ పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు ఎంపిక పోటీలు

ములుగు కలెక్టరేట్, జూన్ 14 : తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాలలైన హకీంపేట, ఆదిలాబాద్, కరీంనగర్‌లో 4వ తరగతిలో ప్రవేశం కోసం జిల్లాలోని బాలబాలికలకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడలు, యువజన శాఖ అధికారి తుల రవి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల స్థాయిలో బాలబాలికలకు ఎంఈవో ఆధ్వర్యంలో ఈనెల 21 నుంచి 25 వరకు వివిధ పోటీలు నిర్వహించి ఎంపిక చేయాలన్నారు. మండల స్థాయిలో ఎంపికైన బాలబాలికలకు ఈనెల 27 నుంచి 30 వరకు జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించాలన్నారు. ఈ పోటీలకు హాజరయ్యే వారు తమ వెంట ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు-3, బోనోఫైడ్ సర్టిఫికెట్, మూడో తరగతి స్టడీ సర్టిఫికెట్ తీసుకురావాలన్నారు. పూర్తి వివరాలకు 7330326241 నంబరును సంప్రదించాలని ఆయన సూచించారు.

అంతర్రాష్ట్ర వంతెన వద్ద తనిఖీలు

మహదేవపూర్, జూన్ 14: మండలంలోని కాళేశ్వరం సమీపంలోని మహారాష్ట్ర-తెలంగాణ అంతర్‌రాష్ట్ర వంతెన వద్ద పోలీసులు భారీగా వాహన తనిఖీలు నిర్వహించారు. కాళేశ్వరం ఎస్సై భవానీ సేన్ ఆధ్వర్యంలో పోలీసులు తెలంగాణలోకి వస్తున్న వాహనాలతో పాటు మహారాష్ట్రకు వెళ్తున్న వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. వాహనదారుల వివరాలు సేకరిస్తున్నారు. ములుగు జిల్లాలో దుశ్చర్యకు పాల్పడిన మావోలు ఇటువైపు రాకుండా ఉండేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. 'సమాచారం మాకు - బహుమతి మీకు' పేరుతో మావోయిస్టులపై ఉన్న రివార్డులతో కూడిన కరపత్రాలు పంచుతున్నారు. కాగా, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పోలీసు అధికారులు తెలిపారు.

రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన డీఎంహెచ్‌వో

ములుగు కలెక్టరేట్, జూన్ 14 : ములుగులోని ఏరియా వైద్యశాలలో బ్లడ్ బ్యాంకు ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రవీందర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య ప్రారంభించి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్లడ్ డొనేషన్ కార్యక్రమం 2004లో ప్రారంభమై 20 సంవత్సరాలు పూర్తి చేసుకున్నదని అన్నారు. జిల్లాలోని ములుగు, ఏటూరునాగారంలోని ఆస్పత్రుల్లో రెండు బ్లడ్ బ్యాంకులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎక్కడైనా ప్రభుత్వ అనుమతితో నిర్వహించే బ్లడ్ డొనేషన్ క్యాంపుల్లో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేయాలన్నారు. అనంతరం రక్తదానం చేసిన 13 మంది దాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌లాల్, వైద్యాధికారులు ప్రవీణ్‌రెడ్డి, సునీత, ల్యాబ్‌టెక్నీషియన్ సతీష్, స్టాఫ్‌నర్సు జయప్రద పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి : ఏపీవో

ఏటూరునాగారం, జూన్ 14 : గోదావరి వరద ముంపు గ్రామాల్లో పనిచేస్తున్న అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఐటీడీఏ ఏపీవో జె.వసంతరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గోదావరి వరద ముంపుపై సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడుతూ.. మండలంలోరి జంపన్నవాగు, గోదావరి వరద ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో ఉంటున్న ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో ప్రజలకు సీజన్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు, ముంపు ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఇందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. 2024 ఫ్లడ్ యాక్షన్ ప్లాన్ వేసుకొని అధికారులు, సిబ్బంది సమన్వయతో పనిచేయాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ అంతటి విజయ, జడ్పీ కోఆప్షన్ సభ్యురాలు ఎమ్డీ.వలియాబీ, మండల ప్రత్యేకాధికారి దామోదరస్వామి రఘు, ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్, ఎంపీడీవో కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సతీష్, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు

ప్రజావేదికలో బయటపడిన అక్రమాలు



మంగపేటలో మాట్లాడుతున్న ఎంపీడీవో కృష్ణప్రసాద్

మంగపేట, జూన్ 14 : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా 2023, ఏప్రిల్ 1 నుంచి 2024, మార్చి 31 తేదీ వరకు మండలంలో పనులు చేపట్టగా సామాజిక తనిఖీ బృందాలు తనిఖీలు చేపట్టాయి. ఈ నెల 1 నుంచి 12 తేదీ వరకు తనిఖీలు పూర్తిచేసి ఆయా పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. తుది నివేదికను సమర్పించుటకు మండలస్థాయి ప్రజావేదిక మండల సభను శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు ఆలస్యంగా ప్రారంభించారు. 15వ సామాజిక తనిఖీ సభకు ఎంపీడీవో జి.కృష్ణప్రసాద్ అధ్యక్షత వహించగా 25 గ్రామపంచాయతీల్లో సామాజిక తనిఖీల వివరాల నివేదికలను డీఆర్పీలు వెల్లడించారు. నిబంధనలకు విరుద్ధంగా కొందరు ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు వ్యవహరించిన తీరును వెల్లడించారు. గ్రామ పంచాయతీల్లో కూలీల వేతనాలకు సంబంధించిన రూ.1,89,29,043 మెటీరియల్ ఖర్చుకు సంబంధించి రూ.29,11,272 మొత్తం రూ.2,18,40,315 వ్యయంతో జరిగిన ఉపాధి హామి పనులపై 2024 జూన్ 7 తేదీ నుంచి 2024 జూన్ 12వ తేదీ వరకు 15వ, సామాజీక తనిఖీ బృందాలు కోట్లాది రూపాయల నిధులతో జరిగిన పనుల వివరాల గురించి గ్రామసభలలో వివరించారు. వెలుగులోకి వచ్చిన అవకతవకలు, అక్రమాలను సామాజిక తనిఖీ బృందం సభ్యులు ప్రజావేదికలో వెల్లడించారు. పలు గ్రామాల్లో ఉపాధి హామీ పనులు ఒకరికి బదులు మరొకరు చేసినట్లు వెల్లడైంది. ఫోర్జరీ సంతకాలతో డబ్బులను చెల్లించినట్లు, కొన్ని గ్రామాల్లో నాటిన మొక్కల సంఖ్య ఎక్కువగా రికార్డుల్లో నమోదు చేసి బిల్లులు చెల్లించినట్లు తనిఖీ బృందం సభ్యులు చదివి వినిపించారు. ఇలా పలు అక్రమాలకు పాల్పడినట్లు బృందం సభ్యులు తెలిపారు. పలువురు పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లకు రూ.53,250 జరిమానా విధించగా, రూ.39,860 రికవరీ చేయాలని అధికారులు ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీడీ వెంకట్‌నారాయణ, క్వాలిటీ కంట్రోల్ అధికారి ధరంసింగ్, సోషల్‌ఆడిట్ ఇన్‌చార్జ్ సమ్మయ్య, ఎస్‌ఆర్పీ కుమార్, ఆడిషనల్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ అంజయ్యగౌడ్, ఈజీఎస్ ఏపీవోలు అంకూస్, సునీత, చరణ్, జేఈ శ్రీనివాస్, ఎఫ్ఏలు, టీఏలుపాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై విచారణ

చిట్యాల : మండలంలోని నవాబుపేట గ్రామంలో గత సంవత్సరం ఉపాధి హామీ పనుల్లో జరిగిన అవకతవకలపై డీఆర్డీవో నరేష్ శుక్రవారం విచారణ చేపట్టారు. గ్రామంలో నివాసం లేని, పనులకు హాజరు కాని వారి పేరుతో నిధులు కాజేశారని కొంతమంది గ్రామస్తులు ఇటీవల ఎంపీడీవో జయశ్రీకి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. కాగా, డీఆర్డీవో నరేష్ గ్రామస్తులు, ఉపాధి హామీ సిబ్బంది, కూలీలతో వేర్వేరుగా మాట్లాడి వారి వాగ్మూలం తీసుకున్నారు. సంబంధిత రిపోర్టును జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు. ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడితే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంపీడీవో జయశ్రీ, ఏపీవో అలీం, పంచాయతీ కార్యదర్శి సుచరిత, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి : మంత్రి

ములుగు కలెక్టరేట్, జూన్ 14: ములుగు మండలంలోని ఇంచర్ల గ్రామంలో ఈనెల 19వ తేదీన నిర్వహించే మెగా జాబ్‌మేళాను జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాబ్‌మేళాలో విప్రో, ముత్తూట్ గ్రూప్స్, అపోలో ఫార్మసీ, వరుణ్ మోటార్స్, నెక్సా మోటార్స్, యాక్సిస్ బ్యాంకు, వెట్రో సాఫ్టెక్ సొల్యూషన్, మేడ్‌ప్లస్, ఎగ్జిట్ ఐ సొల్యూషన్, సెవన్ టెక్ ఐటీ సొల్యూషన్ తదితర 58 కంపెనీలు పాల్గొంటాయని అన్నారు. ఏడవ తరగతి నుంచి డిగ్రీతోపాటు వృత్తివిద్యా కోర్సులు చేసిన వారికి విద్యార్హతను బట్టి ఇంటర్వ్యూ నిర్వహిస్తారని పేర్కొన్నారు.

ఉనికి కోసం సామాన్యులను బలి తీసుకుంటున్నారు : ఎస్పీ

ములుగు, జూన్ 14: మావోయిస్టులు తమ ఉనికి కోసం సామాన్యులను బలి తీసుకుంటున్నారని జిల్లా ఎస్పీ శబరీశ్ అన్నారు. ప్రజలు నడిచే కాలిబాటల వెంట మందుపాతరలను అమర్చుతున్న మావోయిస్టులు అవి పేలడంతో మరణించిన వారిపై ఇన్ఫార్మర్ ముద్రవేసి తమ తప్పును కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ మేరకు శుక్రవారం మీడియాకు ఎస్పీ ఓ ప్రకటన జారీ చేశారు. కర్రెగుట్టలను గెరిల్లా బేస్‌క్యాంపుగా మార్చుకొని చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేందుకు నక్సల్స్ పెద్దఎత్తున మందుపాతరలను అమర్చారని తెలిపారు. గురువారం ఈ ప్రాంతంలో బాంబు పేలిన ఘటనలో దర్ర సునీత అనే మహిళ తీవ్రంగా గాయపడటం విచారకరమన్నారు. మావోయిస్టులపై ఏదైనా ఘటన జరిగితే మానవ హక్కుల గురించి స్పందించే పౌరహక్కుల సంఘం ప్రతినిధులు ఇలాంటి సంఘటనలను ఎందుకు ఖండించడం లేదని ప్రశ్నించారు.

మూడో రోజూ డబుల్ ఇళ్ల లబ్ధిదారుల ఆందోళన

భూపాలపల్లిటౌన్, జూన్ 14 : భూపాలపల్లి పట్టణంలోని భాస్కర్‌గడ్డలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులు మూడవ రోజు ఆందోళన కొనసాగించారు. శుక్రవారం ఇళ్ల వద్ద వంటావార్పు చేసి నిరసన తెలిపారు. టెంటు వేసుకుని ఆందోళన చేశారు. జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. తమకు వెంటనే డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించాలని అన్నారు. ఈ విషయం తెలుసుకున్న మునిసిపల్ కమిషనర్ రాజేశ్వర్ అక్కడికి వెళ్లి లబ్ధిదారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కానీ, వారు వినకపోవడంతో కలెక్టర్‌తో మాట్లాడి డబుల్ ఇళ్ల వద్ద జరుగుతున్న విషయం గురించి తెలిపారు. ఈ క్రమంలో కలెక్టర్ జూలై 1 వరకు సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు కమిషనర్ తెలిపారు.

పేదలకు అండ ఎర్రజెండా

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు అబ్బాస్

కాకతీయఖని, జూన్ 14: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తూ ఎర్రజెండా పేదలకు ఎల్లవేళలా అండగా ఉంటుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు అబ్బాస్ అన్నారు. భూపాలపల్లి పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో అబ్బాస్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం ఎర్రజెండా పార్టీలతోనే సాధ్యమన్నారు. బూర్జువా పార్టీలు, పెత్తందారులు, ప్రజలను దోచుకుంటూ లాభాలు గడిస్తున్నాయన్నారు. పెట్టుబడి రాజ్యాన్ని కూల్చి కార్మిక, శ్రామిక రాజ్యం వచ్చేవరకు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రపంచ దేశాలలో ఎర్రజెండాకు ఆదరణ పెరుగుతుందన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి సాయిలు, నాయకులు దేవేందర్, రాజయ్య, శ్రీకాంత్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీమ్‌కు లక్కీడ్రా

భూపాలపల్లిటౌన్, జూన్ 14: బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీమ్ 2024-25 సంవత్సరానికి 1, 5వ తరగతి ప్రవేశాలకు డ్రా పద్ధతిలో శుక్రవారం భూపాలపల్లిలోని కలెక్టరేట్‌లో లక్కీడ్రా నిర్వహించారు. 1వ తరగతిలో 41 సీట్లు, 5వ తరగతిలో 43 సీట్లకు డ్రా తీశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, విద్యాశాఖ అధికారి రామ్‌కుమార్, టీడబ్ల్యూఆర్ఎస్ కో-ఆర్డినేటర్ భిక్షపతి, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సునీత తదితరులు పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై పోలీసులకు అవగాహన

కృష్ణకాలనీ(భూపాలపల్లి), జూన్ 14: భూపాలపల్లి జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు సిబ్బందికి కొత్త చట్టాలపై నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమం కొనసాగుతోంది. శుక్రవారం జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే పాల్గొని పోలీసు శాఖలో కొత్తగా తీసుకువచ్చిన చట్టాలపై అవగాహన కల్పించారు. ఈనెలాఖరు వరకు కార్యక్రమం కొనసాగనుంది.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

మల్హర్, జూన్ 14 : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని, గ్రామస్తులందరు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని జడ్పీటీసీ అయిత కోమలరాజిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వల్లెంకుంట పాఠశాలలో జరిగిన ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుదర్శనం, అమ్మ ఆదర్శ పాఠశాల ఛైర్మన్ శనిగరం శ్రీకళ, కృష్ణవేణి, అయిత రాజిరెడ్డి పాల్గొన్నారు.

అటవీ భూములను పరిశీలించిన పీసీసీఎఫ్

మహాముత్తారం, జూన్ 14: మహాముత్తారం ఫారెస్టు సెక్షన్ పరిధిలోని అటవీ భూములను రాష్ట్ర ఫారెస్టు ప్రొటెక్షన్ అండ్ విజిలెన్స్ శాఖ నుంచి వచ్చిన పీసీసీఎఫ్ ఇలుసింగ్‌మెరు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సెక్షన్ పరిధిలో జరిగిన పోడు వివరాలు, అన్యాక్రాంతం అవుతున్న అటవీ భూముల వివరాలను స్థానిక ఫారెస్టు అధికారులను అడిగి తెలుసుకున్నారు.

యువతకు పోలీసు శాఖ అండదండలు

కాటారం, జూన్14: నిరుద్యోగ యువత పెడదోవ పట్టకుండా సరైన మార్గంలో పయనించేలా పోలీసు శాఖ కృషి చేస్తుంది. యువత అంకితభావంతో పట్టుదలతో చదివి ఉపాధి ఉద్యోగావకాశాలు అందిపుచ్చుకునేలా అండదండలందిస్తున్నది. ఈ క్రమంలోనే కాటారం సబ్ డివిజన్ పరిధిలోని యువతకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ట్రస్మా)పోటీ పరీక్షల స్టడీ మెటీరియల్ అందజేసింది. కాటారం డీఎస్పీ గడ్డం రాంమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో కాటారం, మహదేవపూర్ సీఐలు నాగార్జునరావు, రాజేశ్వర్‌రావు, సబ్ డివిజన్ పరిధి ఎస్సైలు అభినవ్, నరేష్, మహేందర్, భవానిసేన్‌లు పలు మండలాల నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ఉద్యోగాల పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న యువతతో గురువారం సమావేశం ఏర్పాటు చేయగా ఎస్పీ కిరణ్‌ఖరే స్టడీ మెటీరియల్ పంపిణీ చేసి వారికి దిశానిర్దేశం చేశారు. సమాజంలో పలు రంగాల్లో ఉన్నతంగా రాణించిన వారిని ఆదర్శంగా తీసుకుని భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలని సూచించారు.భవిష్యత్‌లో సుశిక్షితులైన అధ్యాపకులచే అభ్యర్థులకు శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు.

పొలాలు మునగకుండా చర్యలు తీసుకోవాలి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

గణపురం, జూన్ 14 : మండలంలోని మోరంచవాగు ముంపు ప్రాంతాల పంటలు మునగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. కేటీపీపీ ప్రభావిత ప్రాంతమైన దుబ్బపల్లి సమీపంలో ఉన్న మోరంచవాగు పరివాహక ప్రాంతం పంటలను కలెక్టర్ భవేశ్ మిశ్రా, కేటీపీపీ సీఈ సిద్దయ్యతో కలిసి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతీ ఏటా వరదలతో పంటలు నీట మునుగుతున్నాయని, ఈసారి అలాంటి సంఘటనలు జరగవద్దని సూచించారు. కేటీపీపీ ఆధ్వర్యంలో నాటిన జామాయిల్ తోటను పూర్తిగా తొలగించాలని సీఈ సిద్దయ్యకు తెలిపారు. అంతేకాకుండా మోరంచవాగును మరింత వెడల్పుగా చేసి పూడికతీత పనులు చేపట్టాలన్నారు. గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలతో జరిగిన అపార నష్టం అందరిని కలిచివేసిందన్నారు. కార్యక్రమంలో నాయకులు మలహల్‌రావు, గండ్ర సత్యనారాయణరెడ్డి, అప్పం కిషన్, మోకిరాల తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి : డీఈవో


విద్యార్థినులకు పాఠ్యపుస్తకాలు, దుస్తులు పంపిణీ చేస్తున్న డీఈవో పాణిని

గోవిందరావుపేట, జూన్ 14: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సౌకర్యాలు కల్పిస్తుందని, విద్యార్థులకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీపీఎస్‌లో శుక్రవారం ఎంఈవో గొంది దివాకర్ అధ్యక్షతన అక్షరాభ్యాసం జరగగా డీఈవో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థులచే అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా డీఈవో పాణిని మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సౌకర్యాలు ఉన్నాయని, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు, యూనిఫాం, మధ్యాహ్నబోజనం, రాగిజావ, డిజిటల్ విద్యా బోధన, మంచినీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు తదితర సౌకర్యాలు కల్పించిందని అన్నారు. ప్రైవేట్ పాఠశాలల మోజులో పడి ధనాన్ని వృథా చేసుకోకుండా ప్రభుత్వ పాఠశాలలకు పిల్లలను పంపించాలని తల్లిదండ్రులను కోరారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సూడి శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ సృజన్‌కుమార్, ఎంపీడీవో జవహర్‌రెడ్డి, ఏపీవో, గోవిందరావుపేట స్పెషలాఫీసర్ సాహిదాబేగం, పంచాయతీ సెక్రటరీ శంకర్, అమ్మ ఆదర్శ కమిటీ ఛైర్మన్లు కోమల, స్వరూప, భవాని, ఎంపీపీఎస్ హెచ్ఎం కె.రఘురాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేబ్రిడ్జిల తనిఖీ

మహదేవపూర్, జూన్ 14 : మండలంలోని పలుగుల, కుంట్లం, అన్నారం ఇసుక క్వారీల సమీపంలో ఏర్పాటు చేసిన వేబ్రిడ్జిలను జిల్లా తూనికలు, కొలతల అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. కాటారం మండలంలోని గంగాపురి వేబ్రిడ్జి వద్ద తనిఖీలు చేయగా వ్యత్యాసం రావడంతో నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. దీంతో మండలంలోని వేబ్రిడ్జిలను కూడా తనిఖీ చేశారు.

వాజేడులో భారీ వర్షం

వాజేడు, జూన్ 14 : మండలంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం పడింది. ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకొని ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. సుమారు గంటన్నర పాటు కురిసిన వర్షంకు రోడ్లు జలమయం అయ్యాయి. అంతర్గత రోడ్లపై వరద నీరు చేరింది. భారీ వర్షంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. సాయంత్రం సుమారు రెండుగంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

యువత రక్తదానానికి ముందుకు రావాలి

భూపాలపల్లిటౌన్, జూన్ 14 : రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం భూపాలపల్లి పట్టణంలోని ఐటీ మాస్టర్స్ కంప్యూటర్ శిక్షణా కేంద్రంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. అత్యవసర సమయాల్లో ఒకరి ప్రాణాన్ని కాపాడేందుకు రక్తదానం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో యువకులు అధిక సంఖ్యలో పాల్గొని 320 యూనిట్ల రక్తాన్ని ఇచ్చారు. దీనిని వరంగల్‌లోని ఎంజీఎంకు తీసుకువెళ్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఐటీ మాస్టర్స్ సంస్థ ఎండీ వేముల శంకర్, వైద్యులు అరుణ్‌కుమార్, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలపై మహారాష్ట్ర అధికాయుల పరిశీలన

మహదేవపూర్ రూరల్, జూన్ 14: మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా సిరొంచా తాలూక అసరెల్లి, సుంకరెల్లి, బాలముత్యాలపల్లి శివార్లలోని పట్టా భూముల్లో పలిమెల మండలం పంకెనలో ఏర్పాటైన ఇసుక క్వారీ నిర్వాహకులు అక్రమంగా తవ్వకాలు చేపట్టారనే ఫిర్యాదు మేరకు శుక్రవారం మహారాష్ట్ర అధికారులు క్వారీని పరిశీలించారు. గడ్చిరోలి కలెక్టర్ వినయ్ బాసరే ఆదేశాల మేరకు సిరొంచా తహసీల్దార్ చోటావార్‌తో పాటు కలెక్టర్ కార్యాలయ తహసీల్దార్ చేతన్ పాటిల్ ఆధ్వర్యంలో సుమారు 15మంది సర్వేయర్లు, వీఆర్‌వోలు, రెవెన్యూ అధికారులు బృందం సర్వే నిర్వహించారు. మూడు రోజుల క్రితం మహారాష్ట్రకు సంబంధించిన పట్టా భూముల్లో పంకెన ఇసుక క్వారీ నిర్వాహకులు అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారంటూ ఎన్‌పీ కరిష్టన్ గడ్చిరోలి జిల్లా అధ్యక్షుడు పి.సంతోష్, భజరంగ్‌దళ్ నాయకుడు చంద్రశేఖర్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో పరిశీలనకు వచ్చినట్లు తెలిపారు. కాగా, శుక్రవారం అసరెల్లి వైపు నుంచి పంకెన వరకు మహారాష్ట్ర పరిధిలో ఇసుక తవ్వకాలపై పంచనామా నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రేగొండ, జూన్ 14: ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఓవ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని రంగయ్యపల్లి గ్రామ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని ముచింపుల గ్రామానికి చెందిన పులి రవి(63) గోదావరిఖనికి వెళ్లి తిరిగి వస్తుండగా రంగయ్యపల్లిలోని మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న పులి రవి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన భార్య ప్రేమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

రామప్ప సరస్సులో అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

వెంకటాపూర్(రామప్ప), జూన్ 14 : మండలంలోని పాలంపేట గ్రామంలో గల రామప్ప సరస్సులో మునిగి ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన శుక్రవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. స్థానిక ఎస్సై చల్ల రాజు తెలిపిన ప్రకారం... ద్విచక్ర వాహనం నంబర్ ఆధారంగా మంచిర్యాల జిల్లా చెన్నూరు గ్రామానికి చెందిన చందర్ గుజ్జర్(40)గా గుర్తించినట్లు తెలిపారు. మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించామని, వారు వచ్చిన తర్వాతనే పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని అన్నారు. మృతదేహాన్ని ములుగు ఏరియా ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు ఎస్సై వెల్లడించారు.

1104తోనే విద్యుత్ ఉద్యోగుల సంక్షేమం

గణపురం, జూన్ 14 : విద్యుత్ సంస్థల్లో 1104 కార్మిక సంఘంతోనే ఉద్యోగుల సంక్షేమంసాధ్యమని రాష్ట్ర అధ్యక్షుడు వి.వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం కేటీపీపీలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కేటీపీపీ అధ్యక్షుడు ఊరుగొండ సమ్మయ్యఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 74 ఏళ్లుగా కులమతాలకు అతీతంగా కార్మిక సంక్షేమం కోసం అనునిత్యం శ్రమించే సంఘమని తెలిపారు. అంతేకాకుండా విద్యుత్ సంస్థల్లో అనేక కార్మిక సమస్యలు 1104 సంఘంతోనే పరిష్కారం అయ్యాయని తెలిపారు. సమస్యల పరిష్కారానికి కేటీపీపీ సీఈ సిద్దయ్య సహకరించాలని కోరారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి సాయిబాబా, నాయకులు ఉదీర్ రాజేందర్, కోటేశ్వర్‌రావు, దుర్గారావు, అశోక్, ఎల్లస్వామి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

పెసా గ్రామసభలను బలోపేతం చేయాలి

తాడ్వాయి, జూన్ 14: ఐదవ షెడ్యూల్డ్ ఏరియాలో భారత రాజ్యాంగం ప్రకారం పెసా కమిటీలను ఎన్నుకోవడం జరిగిందని, ఎన్నికైన గ్రామసభలను బలోపేతం చేయాలని పెసా జిల్లా కోఆర్డినేటర్ కొముర ప్రభాకర్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాల యంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి రెండు నెలలకోసారి పెసా గ్రామసభలు నిర్వహించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో సుమనవాణి, ఎంపీవో శ్రీధర్, పెసా మండల బాధ్యులు చంద్రయ్య, నవీన్, నగేష్, లక్ష్మయ్య స్వామి, రమేష్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న మిషన్ భగీరథ సర్వే

మొగుళ్లపల్లి, జూన్ 14: మండల వ్యాప్తంగా మిషన్ భగీరథ సర్వే కార్యక్రమం ఐదు రోజులుగా వేగవంతంగా కొనసాగుతోంది. 25 గ్రామ పంచాయతీల్లో మిషన్ భగీరథ సర్వేలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వ్యవసాయ శాఖ ఏఈవోలు, ఐకేపీ సీసీలు మొత్తం 50 మంది పాల్గొంటున్నారు. సర్వేలో భాగంగా వారు ప్రతి ఇంటికి వెళ్లి మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నాయా.. ఇంట్లో ఎంత మంది ఉంటున్నారు, ఎన్నిరోజుల కోసారి నీటి సరఫరా జరుగుతుంది, నీరు సరిపోతుందా, తదితర అంశాలను ట్యాబ్‌లలో నమోదు చేస్తున్నారు. రానున్న రోజుల్లో గ్రామాల్లో నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవడం కోసమే ఈ సర్వే చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. మరో ఐదు రోజుల్లో సర్వే పూర్తవుతుందని వెల్లడించారు.

వైద్యులు, సిబ్బంది సమయం పాటించాలి


వెంకటాపూర్(రామప్ప), జూన్ 14 : వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ రోగులకు నాణ్యమైన వైద్యసేవలందించాలని అదనపు కలెక్టర్ పి.శ్రీజ అన్నారు. శుక్రవారం మండలంలోని నర్సాపూర్ ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని సందర్శించి తనిఖీ చేశారు. ఆరోగ్య ఉపకేంద్రంలో వైద్యులు, సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి అందుబాటులో లేని వైద్యసిబ్బంది ఎందుకు రాలేదని వైద్యాధికారి శ్రీకాంత్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సిబ్బంది రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా ఆరోగ్య ఉపకేంద్రంలో వసతులు ఉండేలా చూసుకోవాలని, వైద్య పరికరాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఉపాధి కూలీల ధర్నా

మహాముత్తారం, జూన్ 14: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట శుక్రవారం కూలీ డబ్బులు తక్కువ వస్తున్నాయని ఉపాధి హామీ కూలీలు ధర్నాకు దిగారు. మండల కేంద్రానికి సమీపంలోని పాలెంకుంట, మక్తచెరువులో ఐదు వారాలుగా 180 మంది కూలీలం ఉపాధి హామీ పని చేస్తున్నామని తెలిపారు. అధికారులు పని ప్రదేశానికి రాకుండానే, కొలతలు తీసుకోకుండానే బిల్లులు చేయడంతో తక్కువ కూలీ వచ్చిందని తెలిపారు. కొండ శేఖర్ అనే ఉపాధి కూలీ తనకు వారం కూలి రూ.840 వచ్చాయని తెలిపారు. అధికారులు పని ప్రదేశానికి వచ్చి తిరిగి కొలతలు తీసుకొని తమకు సరైన కూలీ ఇవ్వాలని వారు కోరారు. ఈ విషయమై ఏపీవో కూమరస్వామిని వివరణ కోరగా కూలీలు పని గంటలు తక్కువగా చేయడంతోనే తక్కువ వేతనం వచ్చిందన్నారు. శనివారం పని ప్రదేశానికి వెళ్లి పరిశీలిస్తామని తెలిపారు.

అందరూ సమన్వయంతో పనిచేయాలి

కాటారం మండల సభలో ఎంపీపీ సమ్మయ్య


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సమ్మయ్య

కాటారం, జూన్ 14 : మండలంలో అభివృద్ధి పనులు, సమస్యల పరిష్కారం కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ పంతకాని సమ్మయ్య అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పలు శాఖలపై చర్చ నిర్వహించగా పలువురు సభ్యులు అధికారులను ప్రశ్నించారు. విద్యుత్ సమస్యలపై అధికారులు సకాలంలో స్పందించడం లేదని, మూడో తీగ బిగించకపోవడంతో వీధిలైట్లు పగలు వెలుగుతున్నాయని ఎంపీటీసీలు ఆరోపించారు. మిషన్ భగీరథ నీరు సక్రమంగా అందడం లేదని, నీటి సరఫరా సరిగా లేక, కొందరు నల్లాలకు మోటార్లు బిగించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. వర్షాకాలంలో పైప్ లైన్ లీకేజీలు లేకుండా చూసి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. అటవీశాఖ అధికారులు ప్రజాప్రతినిధులకు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని, ఇకనుంచి అన్ని కార్యక్రమాలకు పిలవాలని డిమాండ్ చేశారు. నాణ్యమైన విత్తనాలు రైతులకు అందేలా చూడాలని, బ్లాక్‌లో అమ్మకుండా అధికారులు నిత్యం పర్యవేక్షణ చేయాలని అన్నారు.

ఎంపీపీ పంతకాని సమ్మయ్య మాట్లాడుతూ అధికారిక కార్యక్రమాల్లో అధికారులు ప్రజాప్రతినిధులకు సమాచారం అందించి భాగస్వాములను చేయాలన్నారు. ప్రగతి నివేదికలను తూతూమంత్రంగా అందజేస్తున్నారని మండిపడ్డారు. సభ్యులను హార్టికల్చర్ ఫీల్డ్ టూర్‌కు తీసుకెళ్లడానికి ప్రతిపాదించారు. సమావేశంలో మండల ప్రత్యేకాధికారి సంజీవరావు, ఎంపీడీవో అడ్డూరి బాబు, ఎంపీవో ఉపేంద్రయ్య, వైస్ ఎంపీపీ చీర్ల తిరుమలతిరుపతిరెడ్డి, ఎంపీటీసీలు తోట జనార్ధన్, రవీందర్‌రావు, బాసాని రవి, జాడి మహేశ్వరి, విజాయారెడ్డి, రూపాదేవి, బండం రాజమణి, బక్కమ్మ, మమత, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.